నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం నవంబర్ 14, 2024 www.navatelangana.com

సైన్స్ ఫెస్టివల్‌కు ఏర్గట్ల ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు రాజశేఖర్ ఎంపికైనట్టు స్కూల్ హెచ్ఎం కృష్ణాచారి బుధవారం తెలిపారు. ఈ నెల నవంబర్ 30వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు అస్సాంలోని గౌహతీలో జరగనున్న ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు రాజశేఖర్ మాట్లాడుతూ.. సైన్స్ ఫెస్టివల్ లో విన్నూత్నమైన ప్రదర్శనలను వివిధ రాష్ట్రాల నుండి వచ్చే ఉపాధ్యాయుల ఎదుట ప్రదర్శించనున్నట్లు తెలిపారు.


ఉపాధ్యాయులు రాజశేఖర్

దుబాయ్‌లో రోడ్డు ప్రమాదం.. అమ్దాపూర్ వాసి మృతి

- వెళ్లిన వారం రోజులకే మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట హరికృష్ణ(38).. దుబాయ్ లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు గత నెల అక్టోబర్ 24 వ తేదీన బతుకు దెరువు కోసం దుబాయ్ లో గల ట్రాన్స్ గార్డ్ కంపెనీలో క్లీనర్ గా పనిచేయుటకు వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. గత వారంలో అక్టోబర్ 31వ తేదీన రోడ్డు దాటుతుండగా కారు ప్రమాదంలో మృతి చెందినట్లు కంపెనీ ప్రతినిధులు ఈ నెల 7వ తేదీన కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతదేహం నేడు(గురువారం) ఉదయం 5 గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుతుందని గ్రామపెద్దలు తెలిపారు. మృతునికి భార్య, 3 సంవత్సరాలు, ఒక సంవత్సరం వయసు గల ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. దుబాయ్‌కు బతుకు దెరువు కోసం వెళ్లి మరణించిన మృతుని నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

నవతెలంగాణ-కామారెడ్డి

నవంబర్ 17, 18 తేదీల్లో చేపట్టే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులతో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఆర్సిఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అన్ని దశల్లో ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను శాఖాధికారి, సంబంధిత పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ తో సమన్వయం చేసుకొని, ఒక రోజు ముందస్తుగా పూర్తి చేయాలన్నారు. త్రాగునీటి వసతి, కేంద్రం శానిటేషన్ చేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, గాడ్జెస్,ఎలక్ట్రానిక్ పరికరాలు, అనుమతి లేని సామాగ్రిని, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి, కేంద్రంలోకి రాకుండా చూడాలన్నారు. సెంటర్ లలో సి.సి . కెమెరాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. స్క్రైబ్‌ల జాబితా పంపించినట్లు, వారికి సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా విధుల సిబ్బంది, అధికారులు కేంద్రానికి ముందస్తుగా చేరుకొని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షల నోటిఫికేషన్ 2022 లో వచ్చినట్లు, పరీక్షల నిర్వహణలో ఎక్కడ సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అబ్జర్వర్, రూట్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్, శాఖాధికారి, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు అన్ని స్థాయిల వారికి పరీక్ష నిర్వహణ విషయమై తగు శిక్షణ ఇచ్చి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా పూర్తి చేయాలని చైర్మన్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి.విక్టర్, అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి, ఆర్సిఒ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో జాప్యం.. దళారులకే ధాన్యం


కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు

- ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులపై తీవ్ర ప్రభావం
- కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సుముఖత చూపని రైతులు
- సీరియల్, లారీల, కూలీల కొరతతో తూకంలో జాప్యం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కిస్తున్న వ్యాపారులు

నవతెలంగాణ-లింగంపేట్

ఖరీఫ్ సీజన్.. వ్యాపారులకే చేరుతోంది. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడంతో ధాన్యం తూకం, తరలింపు, లారీల కూలీల కొరతతో నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే పంట కోతలు పూర్తి చేసి నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులు విసిగి వేసారి వ్యాపారులకే ధాన్యం విక్రయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మద్దతు ధరకు వంద రూపాయల వ్యత్యాసంతో కొనుగోలు చేస్తుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కానీ తప్పని పరిస్థితుల్లో ధాన్యం వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. తూకం వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచన వేశారు. 5.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా 423 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే పంట చేతికి వచ్చిన సమయంలో రైస్‌మిల్లర్ల విషయంలో ప్రభుత్వం బ్యాంక్ ష్యూరిటీలు పొందే వరకూ కొనుగోలు కేంద్రాలకు మిల్లులను కేటాయించకపోవడంతో తూకం ప్రారంభం కాలేదు. అయితే ఇటీవల ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 179 రైస్ మిల్లులను కేటాయించారు.

చివరకు దళారులకే విక్రయం

తూకంలో జాప్యం కారణంగా విక్రయాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటి వరకు కేవలం సుమారు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించినట్టు సమాచారం. తూకంలో జాప్యం చేయడం వల్ల రైతులు 15 రోజులుగా ఎదురుచూపులు చూసి చివరికి దళారులకు పండించిన ధాన్యాన్ని విక్రయించుకుంటున్నారు. లింగంపేట్ మండలంలో సగానికి పైగా ధాన్యం దళారులకు విక్రయించినట్లు సమాచారం. ప్రభుత్వ ధర క్వింటాకు రూ.2300 ఉండగా.. దళారులు 2200 చెల్లిస్తున్నారు. నగదు రూపంలో తర్వాతి రోజే చెల్లిస్తుండటంతో వారికే విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు.

జాప్యంతో తీవ్ర నష్టం

తూకం ఆలస్యమైనా.. కొనుగోలు మాత్రం వేగంగా చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సీరియల్ ప్రకారం తీసుకుంటున్నా.. వేగంగా చేపట్టకపోవడంతో తమ వంతు వచ్చే వరకూ మరో 20 రోజుల సమయం పట్టే అవకాశం ఉండటంతో అప్పటి వరకు పంటలకు కాపలా ఉండలేక, అకాల వర్షాలు కురిస్తే మొదటికే మోసం వస్తుందని భావించి.. దళారులకే విక్రయిస్తున్నట్టు వాపోతున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి రెండు చొప్పున లారీలు కేటాయించాల్సి ఉండగా.. ఒకటే కేటాయించడంతో అదే లారీ లోడింగ్ చేసుకొని రైస్‌మిల్‌కు వెళ్లి అన్‌లోడింగ్ చేసుకొని వచ్చే వరకు ఆలస్యమవుతుంది. దీంతో ఆ ప్రభావం తూకం మీద పడుతుంది. లింగంపేట్‌లో 15 కొనుగోలు కేందాలు ప్రారంభించగా.. 30 లారీలకు గాను ప్రస్తుతం 15 మాత్రమే నడుస్తుండటం గమనార్హం. పైగా పలు రైస్‌మిల్లుల్లో కూలీల కొరతతో ధాన్యం అన్‌లోడింగ్ నెమ్మదించింది. వీటిన్నింటి ప్రభావంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి సరిపడా లారీలను కేటాయించి, కూలీల కొరత తీర్చి కొనుగోలు వేగవంతం చేస్తే తమకు ఉపయోగమని రైతులు పేర్కొంటున్నారు.

గుర్తింపులేని పాఠశాల మూసివేత

ఎస్ఎఫ్ఐ పోరాటఫలితమే : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్

నవతెలంగాణ-జుక్కల్


స్కూల్‌ను మూసివేయించిన ఎంఈవో

మండలం లోని పెద్దఎడ్గి గ్రామంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా కొనసాగుతున్న వేదవాయిని విద్యానికేతన్ పాఠశాలను విద్యాశాఖ అధికారులు బుధవారం మూసివేశారు. పిల్లలను ప్రభుత్వ స్కూళ్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రు లకు సూచించారు. కాగా ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంతోనే అనుమతి లేని స్కూల్‌ను మూసివేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలంలోని పెద్దఎడ్గిలోని వేదవాయిని విద్యానికేతన్ పాఠవాలకు ఎటువంటి గుర్తింపు లేకపోవడంతో కామారెడ్డి కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాల గుర్తింపు రద్దుచేసి వెంటనే మూసివేయాలని ఇటీవలే ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. జుక్కల్ ఎంఈఓ పాఠశాలను సందర్శించి పాఠశాలలను మూసివేయించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ.. పిల్లలను స్కూళ్లల్లో చేర్పించేముందు వాటికి అనుమతి ఉందో లేదో చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపాలని సూచించారు.

ఇసుక టిప్పర్ ఢీకొని మేకలు మృతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం బండారు పల్లి గ్రామంలో బుధవారం ఇసుక టిప్పర్ ఢీ కొని మూడు మేకలు మృతి చెందాయి. మంజీర నుంచి ఇసుకతో బోధన్ వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్ గ్రామంలో వస్తున్న మేకలకు బసవేశ్వర విగ్రహం వద్ద రోడ్డుపై టిప్పర్ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

కేసుల పరిష్కారంలో చేయూతనివ్వండి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత

- న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయ సేవలందిద్దామని సూచన

నవతెలంగాణ-కంఠేశ్వర్

బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయసేవలు అందిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత శ్రమిస్తే కక్షిదారులకు న్యాయఫలాలు మరిన్ని అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. కోర్టుల ద్వారా సత్వర న్యాయాన్ని ఆశిస్తున్న న్యాయార్థుల ఆశలకు అనుగుణంగా కష్టిద్దామని అన్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత ఎంతో ఉన్నదని, దానిని కాలానికి, సమయానికి అనుగుణంగా మార్చుకుని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకుందామని సూచించారు.

ప్రజలకు అన్ని రాజ్యాంగ వ్యవస్థలకంటే న్యాయవ్యవస్థ పైనే ఎక్కువగా ఆధారపడుతారని, ఆ నమ్మకాన్ని దిగ్విణీకృతం చేద్దామని జిల్లాజడ్జి ఆశించారు. భారత సుప్రీంకోర్టు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు దిగువ కోర్టులపై చాలా ఆశలు పెట్టుకున్నాయని, ఇక్కడనే కోర్టుకేసులు పరిష్కారం అయితే ఎంతోమేలు కక్షిదారులకు చేసినవారం కాగలమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత ఎక్కువగా కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తే కోర్టులలో విచారణ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వెలుసుబాటు లభిస్తుందని అన్నారు.

బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ న్యాయవాద సమాజం ఎల్లప్పుడు ప్రజలకు మెరుగైన, త్వరితగతిన న్యాయసేవలు అందించడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లా ప్రజలకు జిల్లా న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుతామని, కోర్టులలో న్యాయమూర్తుల కొరత, సిబ్బంది కొరత ఉన్నా.. చాలా కోర్టు కేసులు అనుకున్న దానికంటే ఎక్కువగానే పరిష్కారం అవుతున్నాయని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి తెలిపారు. సమావేశంలో అదనపు జిల్లాజడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు,జూనియర్ సివిల్ జడ్జి లు ఖుష్బు ఉపాధ్యాయ్, హరికృష్ణ, హరి కుమార్, చైతన్య, బార్ ఉపాధ్యక్షుడు పెండెమ్ రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దోన్పాల్ సురేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

- ధాన్యం కొనుగోలు పరిశీలించి సమీక్షించనున్న జూపల్లి కృష్ణరావు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. డిచ్‌పల్లి, ఆర్మూర్, ఎడపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు జరుగుతున్న తీరును పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది.

లంచం తీసుకున్న ఇంజినీర్‌కు రెండేండ్లు జైలు శిక్ష

- మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్‌కు శిక్ష
- 2012 నాటి కేసులో తీర్పు వెలువరించిన ఏసీబీ కోర్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ లంచం తీసుకున్న కేసులో రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ హైదరాబాద్ నాంపల్లి ఏసిబి కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోచ్ అక్తర్ బుధవారం తీర్పు ఇచ్చారు. ఏసిబి డిఎస్‌పి శేఖర్‌గౌడ్ వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బొబ్బిలి వీధికి చెందిన బండారి అరవింద్ నిజామాబాద్ పట్టణంలోని సంజయ్ పార్క్ నుంచి విజ్ఞాన పాఠశాల వరకు ఫిర్యాదుదారు తీసుకున్న రోడ్డు కొలతలను నమోదు చేయడం కొరకు అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ 20 వేల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆయన ఏసీబీని ఆశ్రయించాడు. 2012 మే 29వ తేదీనా రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి మున్సిపల్ కార్పొరేషన్‌లో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కేసులో ఏ.సి.బి. తరఫున ఏ ఎల్ మనోజ్ఞ, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.సి.బి. కోర్టు నాంపల్లి, హైదరాబాద్ తన వాదనలు వినిపించగా, ఇరువర్గాల వాదనలు విన్న ఏ.సి.బి. కోర్టు నాంపల్లి, హైదరాబాద్ ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం పోరెడ్డి అశోక్‌కు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 20వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి రిమాండ్

నవతెలంగాణ-రామారెడ్డి


పొలం గొడవల్లో మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ల్యా గల మహిపాల్, ల్యాగాల ప్రసాద్ ల పొలం పక్కన గల కర్రే నగరాజు, కర్రె శ్రీనివాసులు పొలం విషయంలో గొడవపడి, ల్యాగల లక్ష్మీనరసవ్వపై కర్రె నాగరాజు దాడి చేశాడు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి నాగరాజును రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

పోటీ ప్రపంచం.. అన్ని రంగాల్లో రాణించాలి

- బాలోత్సవం ఓ మంచి ప్రయత్నం
- 100 స్కూళ్ల నుంచి 1500 మంది విద్యార్థులు హాజరవడం గొప్ప విషయం
- ముగింపులో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీ తత్వాన్ని తట్టుకోవాలంటే అన్ని రంగాల్లో మేళకువలు తెలిసి ఉండాలని ఆయన సూచించారు. బాలోత్సవం ఓ మంచి ప్రయత్నమని, 100 స్కూళ్ల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొనడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు మల్లు స్వరాజ్యం ట్రస్ట్, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్, జన విజ్ఞాన వేదిక వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. బాలోత్సవం.. చదువుల పండుగ కార్యక్రమం బుధవారం ముగిసింది. మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్య అంటే చదువు ఒకటే కాదని చదువుతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు క్రీడలు కూడా ముఖ్యనేనని ప్రతి విద్యార్థికి ఒక్కో రంగంలో నైపుణ్యత ఉంటుందని వారు ఏ రంగంలో నైపుణ్యత ఉందో ఆ రంగంలోనే వారిని ప్రోత్సహించాలని సూచంచారు.


విద్యార్థి నృత్యప్రదర్శన



బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

ప్రస్తుత భారత జనాభాలో 40 శాతం జనాభా 25 సంవత్సరాల లోపు వయస్సు గల యువతతో కూడుకొని ఉందని గుర్తుచేశారు. దేశంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ హర్యానాలో తప్ప ఎక్కడ లేదని తరువాత మన తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అలాగే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడ రంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుందని ఆయన తెలిపారు.

జిల్లాకు చెందిన ఎండల సౌందర్య, మలావత్ పూర్ణ, నీకత్ జరీన్, గుగ్లోత్ సౌమ్య దేశానికి గర్వకారంగా నిలిచారని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని బాలబాలిక ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, బాలోత్సవ కమిటీ నిర్వాహకులు నర్రా రామారావు, రామ్మోహన్‌రావు, ప్రెసిడెన్సీ పాఠశాల ప్రిన్సిపల్ పవన్‌కుమార్, డాక్టర్ జైనీ నెహ్రూ, రవీంద్రనాథ్ సూరి, కోయోడి నర్సింలు, మోపాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయి రెడ్డి, బాడ్సి సొసైటీ చైర్మన్ మోహన్ రెడ్డి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే..



గిరిజనుల వేషధారణలో విద్యార్థులు

పత్తి మార్కెట్‌లో దోపిడీ అరికట్టాలి

- కనీస మద్దతు ధర, బోనస్ ఇవ్వాలి
- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-మద్నూర్

వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి మార్కెట్లలో దోపిడీని అరికట్టి కనీస మద్దతు ధర రూ.10వేలు, క్వింటాలుకు రూ.575 బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్కెట్ ధర కన్నా మధ్య దళారులు విపరీతంగా లాభాలు అర్జిస్తున్నారని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిపర్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని, కానీ కనీసం మద్దతు ధర రూ.7521 ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి అమ్మకాలు జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో మంచి ధర కొనసాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో వ్యాపారులు మిలాఖత్ అయి పత్తి ధరలను 6 వేల నుంచి 7వేలకు ధరలు తగ్గించారని, నాణ్యత ప్రమాణాలు పేరు చెప్పి రైతులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు బోనస్ కలిపి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే రైతాంగాని కదిలించి ఆందోళన పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రైతులకు సమస్యలు రానీయొద్దు

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-తాడ్వాయి


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వరి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో చేపడుతున్న కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని సత్వరమే రైస్ మిల్లులకు పంపాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రహీముద్దీన్, విండో చైర్మన్ కపిల్ రెడ్డిరైతులు తదితరులు ఉన్నారు.

సర్వే పరిశీలన

మండలంలోని ఎర్రపాడు గ్రామంలో సర్వే పూర్తయిన గృహాలకు స్టిక్కర్లను కలెక్టర్ పరిశీలించారు. మండలంలో 10730 గృహాలు సర్వే చేసేందుకు గుర్తించామని, మండలంలో 65 మంది ఎన్యుమరేటర్లు విధులు చేపడుతున్నారని మండల ప్రత్యేక అధికారి రాజారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీ ఓ సవితరెడ్డి, విద్యాశాఖ అధికారి ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | నవంబర్ 14, 2024 | www.navatelangana.com

స్వామి వారిని దర్శించుకున్న నాయకుడు సంతోష్



నవతెలంగాణ-ముప్కాల్
నిజామాబాద్ జిల్లా భీంగల్ మండల కేంద్రంలోని లింబాద్రిగుట్ట 'శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని బుధవారం నిషిత గ్రూప్ ఇండస్ట్రీ' ఛైర్మన్, ముప్కాల్ వాస్తవ్యులు నాయకుడు సంతోష్ సందర్శించారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను తోటి బంధుమిత్రులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. ఆయన వెంట ముప్కాల్ గ్రామస్తులు జక్కుల రాము, కట్ట మహేష్, గద్దల గంగారాం, శంకర్, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు..

వసతి గృహాలను తనిఖీ చేసిన తహసిల్దార్


తనిఖీ చేస్తున్న తహసీల్దార్

నవతెలంగాణ-సిరికొండ
మండల కేంద్రంలోగల వసతి గృహాలను తహసిల్దార్ రవీందర్ రావు బుధవారం తనిఖీ చేశారు. ఎస్సీ హాస్టల్, ఆదర్శ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టళ్లను బుధవారం సందర్శించారు. భోజన వసతులు, పరిశుభ్రత, శానిటైజేషన్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళలో జంతువులు, విష సర్పాలు లాంటివి ప్రవేశిస్తున్నాయా అని విచారించారు. విద్యుత్ సమస్యల గురించి తెలుసుకున్నారు. సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ సమయానికి హాజరవుతున్నారా లేదా అని విద్యార్థులని అడిగారు విద్యార్థుల యొక్క పలు సమస్యలను నోట్ చేసి పోస్ట్ ఆఫ్ నందు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగరాజం, భోజరం, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుదాం

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కొండ గంగాధర్


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్
మతోన్మాద శక్తుల నుండి తెలంగాణను రక్షించుకుందాం, మతసామరస్యాన్ని కాపాడుకుందామని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కొండ గంగాధర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు ప్రెస్ క్లబ్ నిజామాబాద్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజలు చైతన్యం చేయడానికి మతసామరస్యాన్ని కాపాడటమే లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. లౌకిక తత్వం, ప్రజాస్వామ్య సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రభుత్వ నిరంకుశ వల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. మతోన్మాద, కుల ఉన్మాద రాజకీయాలకు తెలంగాణ గడ్డమీద స్థానం లేదని చాటి చెబుదామని అన్నారు. వామపక్ష ఉద్యమకారులు, సానుభూతిపరులు హాజరై సదస్సును విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇ. సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు


నవతెలంగాణ-రెంజల్
మండలంలోని తాడ్‌బిలోలి, కందకుర్తి, నీలా గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించినట్లు అంధత్వ నివారణ సొసైటీ కంటి వైద్య సహాయకులు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇప్పటివరకు మండలంలోని 11 పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 55 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించినట్టు చెప్పారు. వారికి త్వరలోనే కంటి అద్దాలను అందజేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సింగం వినయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం, విటమిన్ లోపం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత మలేరియా డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్ హెచ్ పి ఉజ్మా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, కంటి వైద్య సహాయకులు మల్లయ్య, కందకుర్తి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీం, ఆరోగ్య కార్యకర్తలు రాణి, రామకష్ణ, చిన్నయ్య ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత


ఫోన్‌లను అందజేస్తున్న పోలీస్‌లు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండల కేంద్రానికి చెందిన కొందరు బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. ఐదు ఫోన్లను రికవరీ చేసి వారికి బుధవారం అందజేశారు. బాధితులు పోలీస్ బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు.

నాస్ పరీక్షకు విద్యార్థులను సన్నదం చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-బోధన్
విద్యార్థులను జాతీయ అచివ్మెంట్ సర్వే పరీక్షకు సన్నదం చేయాలని బోధన్ మండల ఎంఈఓ నాగయ్య అన్నారు. బుధవారం బోధన్ ఉపవిద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ మండలంలోని ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలోని కరస్పాండెంట్లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ నెల 30న నిర్వహించే నాస్ పరీక్షకు 3వ, 6వ, 9వ తరగతి చదివే విద్యార్థులకు సన్నదం చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాల మేనేజ్మెంట్లు నాస్ పరీక్షను పాఠశాలలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన ఆపార్ ఐడిని జనరేట్ చేయాలని సూచించారు. యూడైస్ లో విద్యార్థుల వివరాలు సరి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సూర్య కుమార్, రత్నాకర్, ఆరిపోద్దిన్, బాలచంద్రం, సిఆర్పిలు విజయ్, బాబు ,యూసఫ్, శివానంద్ పాల్గొన్నారు.

బడికి పంపుదాం.. బాల్యం కాపాడుదాం

- పాలకులకు కనిపించని బాల కార్మికులు
- నేడు జాతీయ బాలల దినోత్సవం



నవతెలంగాణ -ఆర్మూర్
నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు ఓ మహనీయుడు. కానీ నేటి బాలలు ఎంతోమంది బాల కార్మికులుగా మారాల్సిన పరిస్థితి నెలకొంటుంది. నేడు జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం..

నెహ్రూ జయంతి సందర్భంగా..
చాచా నెహ్రూ జన్మదినం సందర్భంగా మొట్టమొదట 19 54 లో కష్ణ మీనన్ యూనివర్సల్ చిల్డ్రన్స్ డే అన్న విషయాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రతిపాదించారు. యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ప్రతిపాదనను డిసెంబర్ 14, 1954లో ఆమోదం తెలిపింది. ఆరోజున ప్రపంచ బాలల మధ్య సోదర భావం పెంపొందించే అవగాహన దినంగా భావించాలని సూచించారు. కాలక్రమేనా నవంబర్ 20, 1959న బాలల హక్కులకు గుర్తింపు ఇచ్చారు. మన దేశంలో జవహర్‌లాల్ నెహ్రూ కు పిల్లలపై ఉన్న ప్రేమకు గుర్తుగా ఆయన జన్మదినం రోజున బాలల దినోత్సవాన్ని జరుపుతున్నారు. 18 ఏళ్ల వయసులోపు బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు జరిమానా, జైలు శిక్ష విధిస్తారు..

బాలల హక్కులు ఇవే...
రాజ్యాంగంలోని 39 ఎఫ్ అధికరణం కింద బాలలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు పొందే హక్కు ఉంది. రాజ్యాంగంలోని అనుకరణ 21 ప్రకారం బాలలకు చదువుకునే హక్కును ప్రభుత్వం కల్పించింది. 6 నుండి 14 ఏళ్ల మధ్య వయస్సు వారికి ప్రాథమిక ఉచిత విద్యను అందజేయాలి. రాజ్యాంగంలోని 39వ ఈ అధికరణం కింద వయసుకు మించిన పనులకు పిల్లలతో చేయించకుండా రక్షణ పొందే హక్కు ఉంది. 45వ అదీకరణం కింద శిశు సంరక్షణ హక్కు కల్పించారు. చిన్నపిల్లల సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవడం కోసం హక్కు కల్పించారు. 14 సంవత్సరాల లోపు బాలబాలికలతో ఎలాంటి పనులు చేయించకుండా 1986 లో సెక్షన్ మూడు ప్రకారం బాల కార్మిక నిషేధ చట్టం రూపొందించారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన యజమానులకు ఏడాది వరకు గరిష్ట జైలు శిక్షతో పాటు తగు జరిమానా విధించవచ్చు. తల్లిదండ్రులతో కలిసి బతికే హక్కు తల్లిదండ్రులు విడిపోయిన అనుబంధాన్ని కొనసాగించే హక్కు దేశ సరిహద్దులు దాటి చేరుకునే వారితో జీవించే హక్కు రాజ్యాంగం పిల్లలకు కల్పించింది.

నామమాత్రపు తనిఖీలతో....
బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమం నామమాత్రంగా సాగుతూ ఉండడంతో వారి సంఖ్య పెరిగి పోతుంది. ఛిద్రమవుతున్న బాల్యాన్ని తట్టి లేపే భారతదేశానికి అసలైన వారసులను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎక్కడ చూసిన వీధి బాలలు చిట్టి చేతులు బతుకు పోరుకు సిద్ధమవుతున్నాయి. ఏమైతేనే బావి భారత పౌరులుగా ఎదగాలని బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. బాలలను బడిబాట పట్టించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో వారి బతుకులు కాగితాలకి పరిమితమవుతున్నాయ. బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడానికి ఉన్నత అధికారులు సంబంధిత అధికారులకు పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ వాటిని బేకాతర్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెట్టకపోవడంతో చాలామంది బాలలు వీధి బాలలుగానే మిగిలిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో...
నేడు జిల్లాలోనూ బాల కార్మికులు వ్యాపార సంస్థల్లో టీ కొట్టుల్లో, ప్రైవేటు సంస్థల్లో, మెకానిక్ షాపుల్లో భావన నిర్మాణాల్లో కనిపిస్తూ ఉన్నారు. కొందరైతే బిచ్చగాళ్ళుగ మారి రోడ్ల వెంట అడుక్కుంటూ కనిపిస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నవి. రాజీవ్ విద్యా మిషన్ ఆధ్వర్యంలో బాల కార్మిక విముక్తి కోసం ఉద్యమమే కొనసాగిన వ్యవస్థలో మార్పు రాలేదు. గతంలో కలెక్టర్‌గా పని చేసిన యోగిత రానా బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని అందరూ చదువుకునేలా చూడాలని అన్ని మండలాల రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ అధికారులతో సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు సైతం నిర్వహించారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెట్టకపోవడం, పర్యవేక్షణ పెట్టకపోవడంతో చాలామంది బాలలు వీధి బాలలుగానే మిగిలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు ఆదిశగా చర్యలు చేపట్టి బడి బయట బాల కార్మికులు లేకుండా బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

రంగరాజన్ కమిటీ నివేదిక ప్రకారం 2011-12 లో దేశంలో 33శాతం జనాభా పేదరికంలో ఉండగా ప్రతి 10 మందిలో ముగ్గురు పేదలే. కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితి వల్ల బాలలు శ్రామికులుగా మారుతున్నారు. కొన్ని రకాల పరిశ్రమలలో పెద్దలకంటే పిల్లలు చురుగ్గా పనిచేస్తారని, తక్కువ వేతనాలతో పని చేయించుకోవచ్చని దురాలోచనలతో కొందరు కావాలని బాలల్ని కార్మికులుగా మారుస్తున్నారు.

బాలలతో పనులు చేయిస్తే శిక్షార్హులు..
బంటు మహిపాల్, గోవింద్‌పేట్



మైనర్ బాలబాలికలతో పనులు చేయించేవారు చట్టరిత్యా శిక్షార్హులు అవుతారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అందరిని బడికి పంపాలి. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు కూడా బాల కార్మికులను పెంచుతున్నాయి. బాల కార్మిక వ్యవస్థ సామాజిక సమస్య కాబట్టి దీని నిర్మూలనకు దీర్ఘకాలం కషి అవసరం.

బంగారు భవిష్యత్తుకు పునాదిపడేది బాల్యంలోనే...
డీకే.రాజేష్, ఎస్ఎస్కె క్షత్రియ సమాజ్ జాయింట్ సెక్రెటరీ, ఆర్మూర్.



బాలల బంగారు భవిష్యత్తుకు పునాది పడేది బాల్యంలోనే. నిరక్షరాస్యత కూడా బాల కార్మికుల వ్యవస్థకు కారణం. తల్లిదండ్రులు విద్యాభ్యాస ప్రయోజనాలను గుర్తించలేక తమ పిల్లల్ని చిన్నప్పటి నుంచి శ్రామికులుగా మారుస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు ఆపాలి

- సీపీఐ(ఎం)
- తహసీల్దార్, ఎంఈవోలకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమ తొలగింపులు ఆపాలని సీపీఐ(ఎం) ఆలూరు మండల కార్యదర్శి ఇడ గొట్టి సాయిలు అన్నారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఆర్మూర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలు సుజాతను బియ్యంలో పురుగులు ఉన్నాయనే నెపంతో తొలగించారన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలిపారు. ఎండిఎం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్ మాట్లాడుతూ ఒకపక్క బిల్లులు రాక నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతుంటే పట్టించుకోని హెచ్ఎం ఒంటెద్దు పోకడ పనికిరాదని అన్నారు . ఈ సందర్భంగా తహసిల్దార్ రమేష్, మండల విద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

18న పట్టణంలో...
మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమ తొలగింపులు ఆపాలని బుధవారం ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా చేసి ఎంఈఓ రాజ గంగారాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, సిఐటియు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు సుజాతను బియ్యంలో పురుగులు ఉన్నాయనే నెపంతో తొలగించారన్నారు. బలమైన కారణం లేకుండా తొలగించిన కార్మికురాలను విధుల్లోకి తీసుకోవాలని, అక్రమ తొలగింపు ఆపాలని, హెచ్ఎం వనజ రెడ్డి ని డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు వంట బంద్ చేసి ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. .15న రౌండ్ టేబుల్ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించి 18న చలో ఆర్మూర్ నిర్వహిస్తామని అన్నారు .ఈ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు భూమన్న, రఫిక్, సాజిద్ ఖాన్, ఖలీల్, గర్ల్స్ హైస్కూల్ మధ్యాహ్న భోజన కార్మికులు సుజాత, సత్యమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టాన్ని అమలు చేయాలి

- ఏఐఏకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్
వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని, జీవనభతి సంవత్సరానికి 24వేలు ఇవ్వాలనీఅఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో55శాతం పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. వీరికి ఏడాది పొడవునా పని దొరకడం లేదు. పని దొరికిన కూలితో కుటుంబం నడవక. పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు వలస వెళ్లి. అక్కడ మున్సిపాలిటీ కార్మికులుగా పనిచేస్తున్న పరిస్థితి నెలకొందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12 వేలు జీవనభతి ఇస్తానని హామీని తుంగలోతొక్కి. వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆయన అన్నారు. ఎకరాల లోపు భూమి కలిగిన వారిని వ్యవసాయ కార్మికులుగా గుర్తించాలని.గీత, చేనేత, బీడీ కార్మికులకు ఇస్తున్న నెల పెన్షన్ రెండువేలు ఇవ్వాలని, రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కూలీలకు నెలకు రూ. 4వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐపికెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్, జిల్లా సహాయ కార్యదర్శి నసీర్, జిల్లా ఉపాధ్యక్షులు పార్వతి రాజేశ్వర్, జిల్లా నాయకులు రమేష్, వడ్డెన్న, సీతారాం, పెద్దన్న, కిషోర్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కిన్, హెయిర్ లేజర్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయం

- ఎంపీ ధర్మపురి అరవింద్


జ్యోతిని వెలిగిస్తున్న ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-కంఠేశ్వర్
హైదరాబాద్ నగరాలకు దీటుగా నిజామాబాద్‌లో స్కిన్ అండ్ హెయిర్ లేజర్ క్లినిక్ ను ప్రారంభించడం అభినందనీయమని ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం నగరంలోని ఖలీల్ వాడి లో గల పాత శీతల్ స్కానింగ్ సెంటర్ భవనంలో యాజమాన్యం నర్సింగ్, డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చానుస్ స్కిన్ అండ్ హెయిర్, లేజర్ క్లినిక్ ను రిబ్బన్ కట్, జ్యోతి ప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. స్కిన్, హెయిర్ సమస్యల కోసం హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి చికిత్స పొందే అవసరం లేకుండా, హైదరాబాద్‌కు దీటుగా నిజామాబాద్ నగరంలో క్లినిక్‌ను ఏర్పాటు చేసి సేవలందించడం సంతోషకరమని కొనియాడారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం నర్సింగ్, డాక్టర్ రాజేశ్ మాట్లాడుతూ.. స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ లో అత్యాధునిక మైన పరికరాలతో, నిష్ణాతులైన వైద్యులచే చికిత్సను అందించనున్నామన్నారు.కార్యక్రమంలో డాక్టర్ కరుణాకర్, డాక్టర్ శ్రీ శైలం, డాక్టర్ శ్రీనివాస్, అజయ్, ల్యాబ్ టెక్నీషియన్ రాజ్ కుమార్, శశాంక్, దీపిక, యాజమాన్యం వారి కుటుంబ సభ్యులు, క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ రివాల్యుయేషన్‌కు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ రివాల్యుయేషన్ కు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ దిగువ కోర్సెస్ సిబిసిఎస్- ఒకటవ, రెండవ, మూడవ, నాలుగవ, ఐదవ, ఆరవ సెమిస్టర్(బ్యాక్ లాగ్) మరియు (వై డబ్ల్యు ఎస్ -) ఒకటవ, రెండవ, మూడవ (ఓన్లీ బ్యాక్ లాగ్) జూలై ఆగస్టు - 2024 పరీక్షకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోనుటకు అర్హులు. ఒక్క పేపర్ కు 500 రూపాయలు, రివాల్యుయేషన్ ఫామ్ కు 25 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేయాల్సిన చివరి తేదీ 23 నవంబర్ వరకు ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందన్నారు.

డిగ్రీ టైం టేబుల్ సవరణ.
తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు సవరణతో టైం టేబుల్ ను బుధవారం విడుదల చేశారు.దిగువ కోర్సెస్- సి బి సి ఎస్ - బి ఏ./ బీకాం./ బీఎస్సీ, బిబిఏ, బిసీఎ - ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ రెగ్యులర్, రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్లాగ్(2020 నుండి 2023) బ్యాచ్ విద్యార్థులకు మాత్రమే. ఈ పరీక్షలు తేదీ 24 నవంబర్ నుండి ఉండగా సవరిస్తూ 26 నవంబర్ వరకు పొడిగించినట్టు తెలంగాణా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.

సామాజిక చైతన్య దివిటి కాళోజీ నారాయణ రావు

నవతెలంగాణ-సిరికొండ
సామాజిక గొడవలే తన గొడవలుగా, బ్రతుకంతా పోరాటాలతోనే భావించి నిజాం నిరంకుశత్వ దమన నీతికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా తన కలం ఎత్తి, రజాకార్ల అరాచకాలను ఎండ కట్టి తనదైన భాషా నైపుణ్యంతో ప్రజలను మమేకం చేసి ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమానికి ఊపిరైన్రీ సామాజిక చైతన్య దివిటి కాళోజీ నారాయణ రావు అని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు, పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు 22వ వర్ధంతి సందర్భంగా నేడు సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఆర్.నర్సయ్య కాళోజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు .కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించిన ఆర్డీఓ

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రంలో చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను బుధవారం ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ పరిశీలించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు కుటుంబ వివరాలను తీసుకునేటప్పుడు కచ్చితమైన వివరాలు సేకరించాలని వారికి సూచించారు. ప్రజలందరు తమ కుటుంబ వివరాలను తెలిపి ఎన్యుమరేటర్ల సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఎమ్మార్వో శ్రీలత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ శివ చరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్ ఉన్నారు.

ముప్కాల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమ సరళిని బుధవారం ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్ మండల ప్రత్యేక అధికారి స్రవంతితో కలిసి పరిశీలించారు. మొదటగా ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న సమగ్ర సర్వే పనులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో గౌస్ మొహినోద్దిన్, మండల విద్యాధికారి జక్కుల రవి కుమార్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ స్థలం పరిశీలన


నిర్మాణ స్థలం పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని నాగాపూర్‌లో స్థానిక ఆలయ ఆవరణలో నిర్మించనున్న ప్రజా మరుగుదొడ్ల నిర్మాణ స్థలాన్ని జిల్లా గ్రామీణ అభివద్ధి అధికారి సాయాగౌడ్ బుధవారం పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం గుర్తించిన స్థలం అణువుగా ఉందని, పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ కు సూచించారు. అనంతరం గ్రామంలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి సంధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం


ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు

నవతెలంగాణ-మద్నూర్
రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో లండన్ పర్యటన బృందంలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు విదేశపర్యటన జరుపుకొని బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రావడంతో మండలాల ముఖ్య నాయకులు ఎమ్మెల్యేకు బొకే అందజేస్తూ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు యువ నాయకులు పాల్గొన్నారు.

సర్వేలో తప్పులకు తావివ్వొద్దు


సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్
రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన ఆర్థిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీఓ మలారి సూచించారు. బుధవారం లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి, అయ్యపల్లి, శెట్టిపల్లి తండాలో సమగ్ర కులగణ ఆర్థిక సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పులు లేకుండా చూడాలని ప్రతి కుటుంబం వివరాలు సర్వేలో సక్రమంగా నమోదు చేయాలన్నారు. సర్వే పట్ల ప్రజలకు అపోహలు కలిగించకుండా అవగాహన కల్పించాలన్నారు. స్టిక్కర్లు లేని ఇంటికి సైతం సర్వే చేయాలన్నారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాల లో కంప్యూటర్లను పరిశీలించారు.

జిమ్ వల్ల ఆరోగ్యం

- జిమ్ మజిల్ మానియాను ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్


జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చైర్పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి
జిమ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ అన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం మేరకు పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా ఎస్ఆర్ గార్డెన్ వద్ద నూతన జీమ్ మజిల్ మానియా ప్రారంభించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత


చెక్‌ను అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి
ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బుధవారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి బాధితుడికి అందజేశారు. మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన సుద్దాల అనిల్ ప్రమాదంలో గాయ పడి, ఆసుపత్రిలో చికిత్స పొందగా, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 26 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని, అందులో భాగంగానే పేద ప్రజలు అనారోగ్యానికి గురి అయితే ఆదుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి పేదలను ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గీ రెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అనీఫ్, సుద్దాల రాజయ్య, తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష పారంభిచిన సబ్ కలెక్టర్


పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్
అయ్యప్ప స్వాముల దీక్ష ప్రారంభం సందర్భంగా ఏకచక్రపుర అయ్యప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీముని గుట్ట వద్దగల శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో అయ్యప్ప దీక్షపరులకు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి శివన్నారాయణ మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా చేపడుతున్న అన్నదాన కార్యక్రమం ఈ సంవత్సరం నుంచి 51 రోజులపాటు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రూ.51000 విరాళం ఇచ్చిన భక్తుల పేరున శాశ్వత అన్నదానం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, ఆలయన కమిటీ సెక్రటరీ చక్రవర్తి, కోశాధికారి కొయ్యాడ శ్రీనివాస్, సంతోష్ శర్మ, పావులూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి అనేక చట్టాలు

- జిల్లా జడ్జి సిహెచ్‌వి ఆర్ఆర్ వరప్రసాద్


మాట్లాడుతున్న జిల్లా జడ్జి సిహెచ్‌వి ఆర్ఆర్ వరప్రసాద్


హాజరైన విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి
బాలల సంక్షేమానికి అనేక చట్టాలున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సిహెచ్‌వి ఆర్ఆర్ వరప్రసాద్ సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులకు బాలలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులు లేనటువంటి సమాజం కావాలన్నారు. బాలలపై హింస లైంగిక వేధింపులు వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టాల ద్వారా శిక్షార్హులవుతారని టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని తెలియజేశారు. శ్రీ సరస్వతీ శిశు మందిరంలో సమాజ పోషకంగా చక్కటి వసతులు కల్పిస్తూ ఉన్నతులుగా తీర్చిదిద్దే విద్య అందిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. టి.నాగరాణి సీనియర్ సివిల్ జడ్జ్ కం సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ కామారెడ్డి మాట్లాడుతూ బాలల హక్కులు అందరికీ సమానమని విద్యార్థులు క్రమశిక్షణతో నైతిక విలువలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె స్రవంతి, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కామారెడ్డి, స్వర్ణలత, డిస్టిక్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కామారెడ్డి, బి సురేందర్ రెడ్డి, సెక్రటరీ బార్ అసోసియేషన్ కామారెడ్డి ,డాక్టర్ వి శ్యాంసుందర్రావు, ప్రెసిడెంట్ శ్రీ సరస్వతి విద్యామందిర్ హై స్కూల్ కామారెడ్డి, శ్రీ నల్ల నాగభూషణం, ప్రిన్సిపల్ నాగేష్ అకాడమిక్ ప్రిన్సిపల్, ఇతర కమిటీ మెంబర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- గ్రూప్ -3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్‌లు, పోలీసు అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి
ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం ఎప్పటికప్పుడు తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. అదే విధంగా గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గ్రూప్-3 పరీక్షల సన్నద్ధతతో పాటు వరి ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి కుటుంబ సర్వే తదితర అంశాల పురోగతిపై ఆయా జిల్లాల వారీగా సమీక్షించారు. గ్రూప్-3 ఎగ్జామినేషన్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభ్యర్థులు పాటిం చాల్సిన నిబంధనల గురించి చైర్మన్ మహేందర్ రెడ్డి తెలియజేశారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఈసారి పెద్దఎత్తున 670 కు పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీ.ఎస్‌కు వివరించారు. బుధవారం సాయంత్రం నాటికి ఆయా కేంద్రాలకు రైతులు 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకురాగా, అందులో 1.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో సగటున 16 వేల నుండి 20 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరణ జరుగుతోందని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ జిల్లా నుండి రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్ర మోహన్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, సీపీఓ మల్లికార్జున్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, కిషన్, డీఎస్ఓ అరవింద్, సివిల్ సప్లైస్ డీఎం రాజేశ్వర్, డీసీఓ శ్రీనివాస్, డీఏఓ వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



బుల్లెట్ రైడర్ల జోరు.. ప్రజలు బేజారు

- బాన్సువాడలో శబ్ద కాలుష్యం

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)
పట్టణంలో పలువురు బుల్లెట్ రైడర్లు పట్టణంలో బుల్లెట్ రాత్రి 9 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రధాన వీధుల్లో చక్కర్లు కొడుతు శబ్దం చేస్తున్నారు. ఈ శబ్దం వల్ల చిన్న పిల్లలు, పెద్దలు, పట్టణ ప్రజలు నిద్రకు కరువైతున్నారు. ఈ సమస్యపై దృష్టి పెట్టి, ధ్వని కాలుష్య నియంత్రణకు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుల గణనలో కుమ్మరులు కుమ్మరి అని నమోదు చేసుకోవాలి

- కుమ్మర సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ మధు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
సమగ్ర కుటుంబ సర్వేలో కుమ్మరులు కుమ్మరి అని నమోదు చేసుకోవాలని కుమ్మర సంఘం కామారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ కుమ్మరి మధు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వేలో చాలామంది కుమ్మరులు శాలి వాహన, ప్రజాపతి, బిసి-బి అని నమోదు చేసుకుంటున్నారని అలా కాకుండా కుమ్మరులందరూ కుమ్మరి అని నమోదు చేసుకోవాని సూచించారు. గతంలో చేసిన సమగ్ర కుటుంబ జనగణన సర్వేలో కుమ్మరులు మూడు లక్షల 85000 మంది ఉన్నారని సర్వేలో వచ్చిందని, అది తప్పుడు సర్వేగా ఉందని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 13 లక్షల మంది కుమ్మరులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కుమ్మరి విట్టల్ ఉన్నారు.

విద్యాప్రమానాలు పెంపొందించాలి

- విద్యాధికారి దేవీసింగ్


మాట్లాడుతున్న విద్యాధికారి

నవతెలంగాణ-పిట్లం
ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను పెంపొందించాలని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దెల చెరువు, బండాపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను బట్టి విద్యా బోధన చేస్తూ , క్రమశిక్షణ తో కూడిన విద్యనందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో తాజా ఆకుకూరలతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లో అమలవుతున్న విద్యా కార్యక్రమాలను పరిశీలించి ఆన్ లైన్ లో నమోదు చేశారు. పిల్లల ప్రగతిని తరగతి గదిలో పరిశీలించారు. ఉపాధ్యాయుల , విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. సమ్మేటివ్ – 1 కి సంబంధించిన మార్కులను ఆన్ లైన్ లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుంక్యా, సిబ్బంది మంత్రి మధుసూదన్, హన్మాండ్లు , లావణ్య , జ్యోతి , సాయిలు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దొడ్ల కవిత


నియమక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బిచ్కుంద
వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా దొడ్ల కవిత ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కొంగాల శంకర్, పలకవర్గ సభ్యులుగా అజయ్ పటేల్, సాయిని అశోక్, రాథోడ్ శంకర్, చిన్నరాములు, షేక్ మొహమ్ముద్ గౌరీ, పట్లోళ్ల రాజుపటేల్, గోనెలక్ష్మి, మంతోల మారుతి, డి.శ్రీహరి, మాలిపటేల్ మన్మథరావు, నాగనాథ్ పటేల్, పైడివార్ శివకుమార్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు నియామక పత్రాన్ని చైర్మన్, వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దొడ్ల కవిత మాట్లాడుతూ.. నమ్మకంతో తనను చైర్మన్‌గా నియమించిందుకు ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎమ్మెల్యే సహకారంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి పటేల్, మాజీ డిసిసిబి డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, తోట లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ గుండ్ల భూమయ్య, మాజీ ఎంపీటీసీ సాయిలు, శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

విద్య మహాసభలను విజయవంతం చేయాలి


ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజాంసాగర్
తెలంగాణ మూడవ విద్య మహాసభలను విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టి, ఉపాధ్యాయ సంఘం మహమ్మద్ నగర్ శాఖ ప్రతినిధులు కోరారు. బుధవారం మహాసభ పోస్టర్లను మండలంలోని కోమ్మలంచ గ్రామ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టి, ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి మండల అధ్యక్షులు దేవి సింగ్ మాట్లాడుతూ... డిసెంబర్ ఒకటి రెండు తేదీలలో కామారెడ్డిలో నిర్వహించే విద్య మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని ప్రతి పాఠశాలను సందర్శించి సభ్యత్వం, ఫండింగ్ కోసం ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భీమ్ రావు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం


పశువుకు చికిత్స చేస్తున్న పశు వైద్యాధికారి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి మండల పరిధిలోని సాతెల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని బుధవారం ఎల్లారెడ్డి మండల ఇన్చార్జి పశు వైద్యాధికారి రవికుమార్, పశువైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ ప్రారంభించారు. శిబిరానికి నిజామాబాద్ పశుధన అభివృద్ధి సంస్థ నుండి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 35 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 7 కృత్రిమ గర్భధారణ, 12 సాధారణ చికిత్స, 38 పశువులకు నట్టల నివారణ మందులలను ఉచితంగా అందించినట్టు తెలిపారు. అనంతరం ఈ వైద్య శిబిరంలో మండల పశు వైద్యాధికారి మాట్లాడుతూ శీతాకాలంలో గేదలు ఎదకు వస్తాయని, సకాలంలో అందుబాటులో ఉన్న గోపాల మిత్రుల ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించినట్లయితే మేలు జాతి దూడలు పుడతాయని, అధిక పాల దిగుబడిని కూడా ఇస్తాయని అన్నారు. గర్భధారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు సాయిరెడ్డి, సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రులు మహబూబ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎంపీడీవో, మత్స్యశాఖ అధ్యక్షులు

నవతెలంగాణ-దోమకొండ
దోమకొండ మండల కేంద్రంలోని గుండ్ల చెరువులో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మత్స్య శాఖ అధ్యక్షులు పెద్ద రాజానర్స్ ఆధ్వర్యంలో చేప పిల్లలను చెరువులో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్యశాఖ అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మత్య శాఖ సంఘం సభ్యులు రాజేందర్, చిన్న రాజానర్స్, బాల్ నర్సు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు సీఎం చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని అన్నారం రైతు వేదికలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు కామారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కాట్లపల్లి వెంకటరమణ రెడ్డి అందజేశారు. మద్దికుంట, రెడ్డిపేట్, అన్నారం తో పాటు తాండాలకు చెందిన 11మంది అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 11 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సంజయ్ జై కృష్ణారావు, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, బిజెపి నాయకులు రాజశేఖర్, ముత్యాల రాజు, సాయిరాం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరి బాయి విగ్రహ ఏర్పాటుకు స్థలం పరిశీలన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్టపై నిర్మిస్తున్న పబ్లిక్ పార్క్, మినీ ట్యాంక్ బండ్ పైన ఈశ్వరి బాయి విగ్రహా ఏర్పాటుకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, మాజీ మంత్రి గీతారెడ్డి స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సంఘ సేవకురాలు, మాజీ శాసనసభ్యురాలు, అంబేద్కర్ వాది ఈశ్వరి బాయి ఎల్లారెడ్డి ప్రజలకు అనేక సేవలు అందించారని ఆమె జ్ఞాపకార్థంగా ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, మాజీ జెడ్పిటిసి ఉషా గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ గోపికృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి, పోచయ్యసతీష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని 2వ వార్డులో డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/తాడ్వాయి
మున్సిపల్ పరిధిలోని 4వ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల సాయిలు మంగళవారం పాము కాటుకు గురై ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని బుధవారం మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మనోధైర్యం కల్పించారు. ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌ను కలిసి వైద్య చికిత్స గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తిమ్మారెడ్డి గ్రామ తాజా మాజీ సర్పంచ్ అలీ పాష సతీమణి, తల్లి ఇరువురు ఇటీవల అనారోగ్యంతో మరణించారని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నర్సింలు, టిఆర్ఎస్ టౌన్ అధ్యక్షులు సతీష్, అరవింద్‌గౌడ్, గంగారెడ్డి, వసంతం, శ్రీనివాస్ నాయక్, గంగాధర్, ఫారుక్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్త కుటుంబానికి పరామర్శ
తాడ్వాయి : మండల కేంద్రానికి చెందిన. బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సురుకంటి రామ్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ బుధవారం పరామర్శించారు. 20 సంవత్సరాలుగా పార్టీకి సేవలు చేశారని గుర్తు చేశారు వారి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆయన వెంట విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, సంజీవరెడ్డి, రాఘవరెడ్డి తదితరులున్నారు.

నృత్యంలో ప్రతిభ చాటిన గిద్ద విద్యార్థులు


విద్యార్థులతో అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రామారెడ్డి
హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో బుధవారం రాష్ట్రస్థాయి తెలంగాణ సంగీత సాహిత్య, నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య ప్రదర్శనలో మండలంలోని గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సకాలంలో రక్తం అందజేత



నవతెలంగాణ-కామారెడ్డి
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో కనకవ్వ(40) ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలును సంప్రదించారు. పరిదీపేట్ గ్రామానికి చెందిన ఎల్లయ్యగారి అనిల్‌కుమార్ సహకారంతో రక్తాన్ని కేబీసీ రక్తనిధి కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. గతంలో కూడా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి కావలసిన రక్తాన్ని అందజేయడానికి రక్తదాత అనిల్ కుమార్ ముందుకు రావడం జరిగిందని తెలిపారు. రక్తదాతకు ఐవిఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్నల తరపున అభినందనలు తెలియజేశారు. రక్తాన్ని అందజేయాలనుకున్నవారు వివరాలను 9492874006 నెంబర్‌కి పంపించాలని తెలిపారు.

యాసంగి పంటకు సిద్ధమవుతున్న రైతన్నలు



నవతెలంగాణ-రెంజల్

ఆరుకాలం కష్టించి పండించిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయిస్తూనే, మరోవైపు యాసంగి పంటకు రైతన్న సిద్ధమవుతున్నారు. తమ పంట పొలాలను దమ్ము చేస్తూ మురగబెడుతూ, నారుమడులు తయారు చేసుకుంటున్నారు. పండించిన పంట తరలించక ముందే మరో పంటకు నారు సిద్ధమవడం విశేషం. యాసంగిలో ఎంత ముందుగా పంట వేసినట్లయితే దిగుబడి ఎక్కువ వస్తుందన్న ఆశతో రైతన్నలు పంటల వైపు దృష్టి సారించారు.

ఆరబెట్టిన ధాన్యం దగ్ధం



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని పెంటకలాన్ గ్రామం సమీపంలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వారి పంట పొలానికి నిప్పు పెట్టడంతో అది క్రమంగా ఆరబెట్టిన ధాన్యానికి అంటుకుంది. బుధవారం పలువురు రైతులకు చెందిన మూడు ఎకరాల బీపీటి ధాన్యం అగ్నికి ఆహుతైంది. కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకుందామని ఆరబెడితే కొంతమంది రైతులు వారి పంట పొలాలకు నిప్పు పెట్టడం వల్ల ధాన్యం కాలిపోయిందని బాధిత రైతులు వాపోయారు. పంట పొలంలోని గడ్డికి నిప్పు పెట్టవద్దని అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించిన రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పంట పొలంలో మంట పెట్టడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

పెగడపల్లి నుంచి సాటాపూర్ గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ట్రాక్టర్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో దానిని పోలీస్ స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుకను తరలించినట్లయితే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పెండింగ్ డైట్ బిల్స్‌ను వెంటనే రిలీజ్ చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్స్ వెంటనే రిలీజ్ చేయాలని, స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థులు విలవిలలాడుతున్నారని ఏబిపిఎస్‌యు డివిజన్ కార్యదర్శి గోపాల్ సింగ్ ఠాగూర్ అన్నారు. పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లను బుధవారం సందర్శించి అక్కడ ఉన్న విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. 'గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ హాస్టళ్ల నిర్వహణ చాలా అధ్వానంగా తయరయ్యాయని, విద్యార్థులకు కనీస రక్షణ కరువైందని ఏబీపీఎస్యు విద్యార్థి సంఘ నాయకులు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న డైట్ బిల్స్ విడుదల చేయాలని, స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి వెళ్లిన యువకుడు మృతి



మృతి చెందిన రాంచరణ్ తేజ్

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మానిక్ బండార్ గ్రామానికి చెందిన వ్యక్తి బుధవారం తడపాకల్ గోదావరి నదిలో స్నానానికి వెళ్ళి చనిపోయిన ఘటన పలువురిని కలచివేసింది. ఏర్గట్ల ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం... మానిక్ బండార్ గ్రామానికి చెందిన రాంచరణ్ తేజ్ (16) సంవత్సరాలు గల వ్యక్తి తన తల్లి గంగమణితో కలిసి కార్తీక మాసం సందర్భంగా తడపాకల్ గోదావరికి వెళ్లాడు. స్నానానికి వెళ్ళి ఈత రాక నీట మునిగి చనిపోయినట్లు తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని అన్నారు.

మాశెట్టి నర్సయ్యకు ఘన సన్మానం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవా ప్రతినిధిగా 50 సంవత్సరాలుగా తన సేవలను అందించిన బోధన్ పట్టణ వాసి మాశెట్టి నర్సయ్యకు బుధవారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగ మాశెట్టి నర్సయ్య మాట్లాడుతూ తాను 50 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్‌లో ఎన్నో సేవలను అందించానని తెలిపారు. తన సేవలకు గుర్తుగా ఇప్పటి వరకు ఎన్నో అవార్డులు, సన్మానాలు పొందినట్లు చెప్పారు. భవిష్యత్తులో లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవలను అందిస్తానని నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ముఖ్య ప్రతినిధి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ బాల్కొండ

మండల కేంద్రంలో ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు, మద్యం సేవించిన వానహదారులపై కేసును నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపిన చట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన వాహనాల పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుల్ అనిల్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..?

- మండల ప్రత్యేకాధికారి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో ఎస్సి బాలుర వసతి గృహాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి శివకృష్ణ సందర్శించారు.విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి పలు సలహాలను,సూచనలు ఇచ్చారు. ఆయనవెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,ఎంపీఓ శివ చరణ్,పంచాయతీ కార్యదర్శి జాకీర్ ఉన్నారు.

18లోగా సర్వే పూర్తి చేయాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయగౌడ్



సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఈనెల 18 లోపు పూర్తి చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, వివరాలను సరిగ్గా నమోదు చేయాలన్నారు. నిర్దేశిత సమయంలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కమ్మర్‌పల్లిలో రాజీవ్ గాంధీ కాలనీలో ఎన్యుమరేటర్లు చేస్తున్న సర్వేను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయగౌడ్ స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఐకెపి ఏపిఎం కుంట గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వే ను ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను పొందుపరచాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా సర్వే జరపాలని ఆయన సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి సునీల్ యాదవ్ ఉన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- పోలీసుల సూచన

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భక్తులు విలువైన వస్తువులను ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని, కొత్తవారితో జాగ్రత్త వహించాలని, దర్శనం సమయం లో క్యూ లైన్ పాటించాలని, ఎవరిని దూషించకూడదని ఎవరైనా అనుమానిత వ్యక్తులు గాని అనుమానిత వస్తువులు గాని కనిపిస్తే దగ్గర్లో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందించాలని తెలిపారు. శ్రీ నింబాద్రి లక్ష్మీనరసింహ స్వామి జాతరకు విచ్చేయుచున్న భక్తులకు భీంగల్ పోలీసులు బుధవారం శుభాకాంక్షలు తెలియజేసి సూచనలు అందించారు. జాతర సందర్భంగా ఏసీపీ ఆర్మూర్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పిస్తున్నట్టు తెలిపారు. 300 మంది పోలీసులతో పకడ్బందీగా జాతర బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏసీపీ, ఆరుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలతో కలిపి 300 మంది సిబ్బంది జాతర బందోబస్తులో పాల్గొంటున్నట్టు తెలిపారు. జాతర మొత్తం 50 సీసీ కెమెరాతో రెండు కమాండ్ కంట్రోల్‌లో వీక్షిస్తున్నట్టు తెలిపారు. గుట్టపై 20, గుట్ట క్రింద 10, భీంగల్‌టౌన్‌లో 20 కెమెరాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. గుట్ట పైకి ఎలాంటి టువీలర్స్, ఫోర్ వీలర్స్‌కు అనుమతి లేదని అన్నారు. పార్కింగ్‌లో సీరియల్‌గా వెహికల్స్ పెట్టుకోవాలని ఎలాంటి విక్రయ కేంద్రాలు, షాప్స్‌కు గుట్టపైకి అనుమతి లేదని తెలిపారు. బీటీ రోడ్డుపైనే ఎలాంటి షాపులు ఉండకూడదని, జాతరకు మొత్తం ఆరు ఔట్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఏదైనా ఎమర్జెన్సీ సందర్భంలో ఔట్‌పోస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు. భక్తులకు ఏమైనా ఎమర్జెన్సీగా సంప్రదించాలంటే డయల్ 100 కానీ, భీంగల్ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712659766 గాని, ఎస్‌హెచ్‌వో - భీంగల్-8712659866 గాని, సీఐ భీంగల్ 8712659865 గార్లకు కాల్ చేయాలని తెలిపారు.

హామీలను అమలు చేయండి
రైతాంగ సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు భూమయ్య

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రజలకిచ్చిన హామీలనుఅమలు చేయటంలో విఫలమవుతుందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో గల ఎన్ఆర్ భవన్ లో బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేల్పూర్ భూమయ్య మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఆరుగ్యారెంటీల అమలును అటకెక్కిస్తున్నారని అన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, జిల్లాలో గల చక్కెర ఫ్యాక్టరీలు ఎన్ఎస్ఎఫ్ బోధన్, ఎన్సిఎస్ఎఫ్, సారంగాపూర్ తెరిపించడానికి ప్రభుత్వం వేసిన సబ్ కమిటీ సైతం పరిశీలించి తన రిపోర్టును ప్రభుత్వానికి అందించిన కూడా ఫ్యాక్టరీలను తెరిపించడంలో ప్రభుత్వం మీనా మేషాలు లెక్కపెడుతుందని అన్నారు. ఎన్ఎస్ఎఫ్, ఎన్సిఎస్ఎఫ్ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి ప్రభుత్వమే నడిపించాలని వారన్నారు. జిల్లాలో అసైన్డ్ భూములకు డిజిటల్ పాసుబుక్కులు రాక వేలాది ఎకరాలు పెండింగ్ లో ఉన్నాయని, దీని మూలంగా ప్రభుత్వం నుంచి పొందే రైతు బీమా, రైతు బంధు రైతులు పొందలేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అసైన్డ్ భూములకు డిజిటల్ పాస్ బుక్కులు అందించాలని వారన్నారు. ధరణిలో ఉన్న లోపాలను సరి చేయడానికి తీసుకువచ్చిన భూమాత ద్వారానైనా లోపాలను సరిచేసి రైతులకు రెవెన్యూ రికార్డులను సరి చేయాలని వారన్నారు. రెవెన్యూ ఫారెస్ట్ వారి మధ్య ఈ భూ తగాదాలను ముందు పరిష్కరించి పేదలు సాగు చేసు కునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు పరచాలని, రైతు భరోసా రబీ, ఖరీఫ్ సీజన్లో పంటలకు రైతులకు అందలేదని, ఈ రబీ సీజన్‌కు రైతు భరోసాను అందజేయాలని, రైతు ధాన్యం డబ్బులతోపాటు 500 బోనస్ఇవ్వాలని, అలాగే ఎకరాకు 7500 చొప్పున రెండు పంటలకు 15000 రూపాయలు రైతు ఖాతాలో రైతు భరోసాను జమ చేయాలని అన్నారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు నెలకు 2500 రూపాయలు ప్రారంభం కాలేదని, కల్యాణ లక్ష్మి లక్ష రూపాయలు తులం బంగారం, తెలంగాణ పోరాటంలో కేసులున్నవారికి ఇంటి స్థలం ఇందిరమ్మ ఇండ్లు అమలు కాలేదని వాటి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని భూమయ్య అన్నారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డెకొట్టి సాయి రెడ్డి ఉపాధ్యక్షులు పర్వయ్య, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి

- న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు



మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు

నవతెలంగాణ-ఆర్మూర్

కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లా కేంద్రంలో జరిగే మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లో బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందని, భారత రాజ్యాంగాన్ని ఖూనిచేస్తూ, ప్రజల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతుందని అభిప్రాయపడ్డారు. మతం వ్యక్తిగతమని, కానీ మతం పేరుతోరాజకీయాలు చేయడం సరికాదని ఆయన అన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో పాలక వర్గ పార్టీలు ప్రజల ఆలోచనలు వక్రమార్గం పట్టిస్తున్నాయని ఆయన తెలిపారు. 10 సంవత్సరాల పాలనలో బిజెపి నరేంద్ర మోడీ సర్కార్ ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ప్రశ్నిస్తే నిర్బంధిస్తుందని ఆయన అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలు తెచ్చి ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన అన్నారు. పనైనా చూపండి తిండి అయినా పెట్టండి అని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని రుణమాఫీ అందరికీ వెంటనే జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు 4000 జీవన భృతి ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్య శివాజీ, బాలయ్య, అబ్దుల్, మార్క్స్, ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్,
స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీజీవీపీ జిల్లా అధ్యక్షులు కళ్యాణ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చౌరస్తా వరకూ ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీవీపీ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా రాష్ట్రంలో 8214 వేల కోట్ల ఫీ రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థుల తలిదండ్రులు అప్పులు చేసి చదివించుకుంటున్నారని, పేద విద్యార్థులు ఆర్థికంగా లేక చదువులు మాని కూలీ పనులు చేసుకుంటున్న దౌర్భాగ్య స్థితి ఏర్పడిందని అన్నారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని, లేని పక్షాన విద్యార్థులతో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో నగర అధ్యక్షుడు అఖిల్, వినయ్, సుజిత్, సాయి, మహేష్, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు

బోధన్ : తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటీలో స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారకులు ఎవరు అని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారున్నా గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించాలని వారికి మనోధైర్యం కల్పించాలని తెలిపారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని అన్నారు. కార్యక్రమంలో మిసాలే నగేష్, నిఖిల్, ప్రసాద్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌వాల్‌కు మరమ్మతులు

- నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

సాతాపూర్ గేటు వద్ద డీ-46 కాల్వ పక్కనే ఉన్న పైప్‌లైన్ వాల్‌కు మరమ్మతులు చేపట్టిన అధికారులు. బుధవారం నవతెలంగాణలో మిషన్ భగీరథ పైప్ లైన్ వాల్ లీకేజీ అనే శీర్షిక కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించి. లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ వాల్‌కు మరమ్మతులు చేపట్టారు.



గ్రూప్-3 పరీక్షల కేంద్రాల వద్ద ఆంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఈ నెల 17,18న జరిగే గ్రూప్-3 పరీక్షలకు పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు విధించినట్టు నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ బుధవారం తెలిపారు. గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో మొత్తం 66 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఏసీపీ, సీఐ, ఎస్‌హెచ్, ఎస్ఐలను ఆదేశించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, 100 మీటర్లలోపు ఉన్న జిరాక్స్ దుకాణాలు మూసి వేయించాలని సూచించారు. అలాగే 22 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు ఒక్కో పోలీస్ అధికారిని కేటాయించినట్టు పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

- ముగ్గురికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష, మరో ముగ్గురికి 8వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ట్రాఫిక్ సిఐ వీరయ్య బుధవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని మార్నింగ్ కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ అహ్మద్ మొయినుద్దీన్ ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, ముగ్గురికి రూ.8వేల జరిమానా విధించారని తెలిపారు.

ఆరబెట్టిన సోయా చోరీ



చోరీ అయిన సోయాను చూపుతున్న రైతు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన రైతు రెడ్డి భూమయ్య, తన నాలుగున్నర ఎకరాల్లో పండించిన సోయా పంటను రాజన్న చౌరస్తా వద్ద ఆరబెట్టారు. మంగళవారం రాత్రి గుర్తు దుండగులు సోయాపంటను దొంగిలించినట్లు రైతు తెలిపారు. సోయాపంట కోసి నూర్పిడి చేసి రోడ్డు పక్కన కుప్పవేసి పెట్టగా 16కింటాళ్ళు ఎత్తుకెళ్లినట్లు రైతు తెలిపారు. ఈ విషయమై బోధన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



లబ్దిదారులకు చెక్కులు అందజేసిన నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సిఎంఆర్ చెక్కులు లబ్దిదారులకు బుధవారం మండల కేంద్రంలో పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ నాయకులు ఘన లక్ష్మణ్ తెలిపారు. ఐదుగురు లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. లబ్దిదారులు భూపతి రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కం బాలకిషన్, బంగ్లా వసంత్ రావు, మాజీ ఎంపిటీసీ గంగారెడ్డి, గన్న లక్ష్మణ్, గడ్డం సంజయ్, సైకిల్ టాక్స్ అక్బర్, గన్న సూరి, రెహమత్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని తొర్లికొండ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్దిదారులకు అందజేసినట్టు ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుక రవి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఉత్కం శ్రీనివాస్ గౌడ్, తొర్లికొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, గ్రామ సెక్రెటరీ కూడాల వినోద్, గ్రామ ప్రధాన కార్యదర్శి కనక రాకేష్, దేవదాయ కమిటీ చైర్మన్ కాటిపల్లి సాయిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు .

ఆర్ఎంపి, పిఎంపి యూనియన్ ఆధ్వర్యంలో
అనాథ వృద్ధాశ్రమలో అన్నదానం



నవతెలంగాణ-వర్ని (మోస్రా)
మండలంలోని చింతకుంట గ్రామంలోగల అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం బోధన్ ఆర్ఎంపి, పిఎంపి యూనియన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు.ఈ సందర్బంగా గెట్ గెదర్ కార్యక్రమం అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవాలని తమ ఆశయం అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్ట అశోక్, బోధన్ అధ్యక్షులు రాజగోపాల్ చారి, రుద్రూర్ అధ్యక్షులు శంకర్, సెక్రటరీ కిసాన్, గోపి, హుసేన్, ఖలీల్, హాజర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ
కొత్తగా ఇటీవల విడుదలైన ఏఎన్ఎం పోస్టుల భర్తీలో కేజీబీవీలో పనిచేసిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (టీయుసీఐ) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాధికారి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీలో అనేక సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలకే పని చేశారన్నారు. రిటైర్మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచాలని, 61 సంవత్సరాల నిండిన వారిని తొలగించిన విషయంలో, వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకే ప్రాధాన్యం ఇవ్వాలని , రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందివ్వాలని అన్నారు. అన్ని కేజీబీవీల్లో పనిభారం పెరిగిందని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ఈఎంఆర్ఎస్ బాలికల ప్రతిభ



డిచ్‌పల్లి : రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలికలు



నిజామాబాద్‌సిటీ : హాకీ టోర్నీ విజేత జట్టు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్‌సిటీ
ఇందల్‌వాయి మండలంలోని గంగారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాక్లూర్ తండా వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)కు చెందిన విద్యార్థినులు పలు క్రీడల్లో విజేతలుగా నిలిచినట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెల 7,8,9వ తేదీలలో సిరిసిల్ల జిల్లా టీజీఇఎంఆర్ఎస్-ఎల్లారెడ్డిపేటలో నాలుగవ రాష్ట్రస్థాయి క్రీడలు ఘనంగా నిర్వహించారు. ఇందులో అండర్-19, వాలీబాల్ విభాగంలో ఈఎంఆర్ఎస్-ఇందల్‌వాయి విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచి నేషనల్‌కు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. సెలెక్ట్ అయిన వాళ్లలో కెప్టెన్ జి.కృష్ణవేణి, బి.పూజ, ఆర్.అఖిల, పి.సంగీత, ఆర్.వైష్ణవి, జే.అశ్విత వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు.

అలాగే బాక్సింగ్‌లోలో అండర్-19లో కె.గంగామణి ప్రథమ స్థానం, కే.హారిక బాక్సింగ్, రెజ్లింగ్‌లోనూ ప్రథమ స్థానం పొందారు. జూడోలో ద్వితీయ స్థానాన్ని సాధించారని ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ వివరించారు. అండర్-19 షార్ట్‌పుట్‌లో జి.కృష్ణవేణి ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్‌లోనూ ద్వితీయ స్థానం సాధించారు. అండర్-14 లాంగ్ జంప్‌లో శృతి ద్వితీయ స్థానం, షణ్ముఖ ప్రియ బాక్సింగ్‌లో ద్వితీయ స్థానం, రెజ్లింగ్‌లో తృతీయ స్థానం, మీనాక్షి అథ్లెటిక్స్‌లో తృతీయ స్థానం సాధించారు. అలాగే వెయిట్ లిఫ్టింగ్‌లో తృతీయ స్థానం, టేబుల్ టెన్నిస్‌లో తృతీయ స్థానం, జూడోలో తృతీయ స్థానాన్ని విద్యార్థినులు సాధించారు. ఈ క్రీడల్లో ఈఎంఅర్ఎస్-ఇందల్‌వాయి నుంచి 50 మంది బాలికలు వివిధ తరగతుల నుంచి పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ ఘన విజయాన్ని సాధించిన బాలికలనందర్నీ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు. క్రీడ పోటీలతో మానసికోల్లాసం కలుగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు సంపాదిస్తారని అశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, సునీత, రోహిత్, దివ్య, రేఖ, సరళ, కళావతి, రితేష్ అధ్యాపకులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ విజేతగా
నిజామాబాద్ బాలికల జట్టు

నిజామాబాద్‌సిటీ : 68వ రాష్ట్రస్థాయి బాలికల హాకీ టోర్నీ విజేతగా నిజామాబాద్ జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బాలికల హాకీ టోర్నీ ఫైనల్ మ్యాచ్లో 2-0 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడలకు నిజామాబాద్ జిల్లా పుట్టినిల్లు అని, త్వరలోనే ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు నిజామాబాద్ జిల్లాకు స్టేడియం అన్ని హంగులతో నిర్మించబోతున్నామని తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన గడుగు గంగాధర్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగమణి గ్లోబల్ పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్ పీడీలు రవికుమార్ కార్యనిర్వాహక కార్యదర్శి గోపిరెడ్డి పేట సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి శీను వెంకట్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్.. రైతుల వ్యతిరేక పార్టీ

రాష్ట్రంలో సర్కార్‌ను నిలదీయలేక జాతీయస్థాయిలో వెళ్లి ఏం సాధించావు కెటిఆర్..?
నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్



ధాన్యంపరిశీలిస్తున్న ఎంపీ అరవింద్, జిల్లాఅధ్యక్షులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
కాంగ్రెస్ పార్టీ రైతుల వ్యతిరేక పార్టీ అని, ఏడాదికాలంగా రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీలను నెరవేర్చక తుంగలో తొక్కిందని, రాష్ట్రంలో సర్కార్‌ను నిలదీయలేక జాతీయస్థాయిలో ఎవరు గొప్ప కొరకు వెళ్లి ఏం సాధించావని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. బుధవారం గన్నారం గ్రామంలో ధాన్యం కనుగోలు కేంద్రాలను ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే బిజెపి జిల్లా అధ్యక్షులు సందర్శించారు. తదనంతరం విలేకరులతో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ధాన్యం కోనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వడ్లు కంట జరగలేదని, సన్నాళ్లకు రూ.500 ఇస్తానన్న బోనస్ ఇప్పటికి అందించాలేదని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నాయిని రాజన్న, బిజెపి సీనియర్ నాయకులు కేపి రెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, శ్రీనివాస్, కార్యకర్తలు, రైతులు, పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని పెర్కిట్‌లో సంతోష్ ఫ్యామిలీ దాబా హెూటల్ ముందర గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైనట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. వయసు 30 , 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై నలుపు రంగు, ఫుల్ హ్యాండ్ షర్ట్‌పై తెలుపు రంగు చెక్స్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి, తల వెంట్రుకలు , గడ్డము నలుపు తెలుపు రంగులో ఉన్నాయని తెలిపారు. పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో మృతదేహాన్ని భద్రపరిచినట్టు చెప్పారు. మృతుని వివరాలు తెలిస్తే ఈ నెంబర్‌కు 8712659858 ఫోన్ చేయాలని తెలిపారు.

మారుమూల గ్రామాల అభివృద్ధి ధ్యేయం

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-తాడ్వాయి
మారుమూల గ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వ ధ్యేయమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. బుధవారం మండలంలోని సోమవారం గ్రామంలో రోడ్డుకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. సోమవారం గ్రామం నుండి బసవపల్లి నాలుగు కిలోమీటర్లకు వరకు 3.80 లక్షల నిధులు మంజూరు చేశామని చేశామన్నారు అనంతరం చిట్యాల గ్రామంలో 1.79 లక్షలతో విద్యుత్ ఉపకేంద్రం కోసం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి. వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి. మండల పార్టీ ఉపాధ్యక్షులు.శివాజీ, పులి బాబు, మెట్టు రామచంద్రం, బాలయ్య, నర్సారెడ్డి మండల మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండలంలోని పల్లికొండ గ్రామంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని పల్లికొండ సెక్రటరీ బి,రామ్ మోహన్ తెలిపారు. వివరాలను సర్వేలో నమోదు చేసుకోవాలని, దీనికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టా పాసుబుక్ పత్రాలను సమకూర్చి పెట్టుకోవాలని అన్నారు. ఎన్యుమరేటర్లకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సెక్రెటరీ రామ్‌మోహన్

లింబాద్రి గుట్టకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఉత్తర తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భీమగల్ మండలంలోని లింబాద్రి గుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుండి 17 వరకు జరుగుతున్నందున ఆర్టీసీ ఆర్మూర్, నిజామాబాద్, ధర్పల్లి, సిరికొండ నుండి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు నిజామాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కె. జానిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణంతో గమ్యం స్థానాలకు చేరాలని కోరారు.

సైబర్ క్రైంపై అవగాహన

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గల ఐఎంఎల్ డిపోలో పనిచేసే కార్మికులకు ట్రాఫిక్ అవేర్నెస్, సైబర్ క్రైమ్ మోసాల గురించి అవగాహనా సదస్సు ఎస్సై రాజశేఖర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల గురించి అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్. కె, ఆడేల్లు. కానిస్టేబుల్లు, విజయ్ బాబు, గంగాధర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాల ఉత్పత్తి పెరుగుతుంది

మండలం పశువైద్యాధికారి ప్రమోద్ కుమార్



నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని పోచారం గ్రామంలో బుధవారం, జిల్లా పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భకోశ వ్యాధుల చికిత్స శిభిరానికి జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వైద్యులు జగన్నాథ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వైద్యులు మాజిద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కృత్రిమ గర్భధారణ చేస్తే పశువులకు మంచి జాతి ఆడ దూడలు జన్మిస్తాయని పశు సంతతి పెరుగుతుందని వైద్యులు మాజిద్ వివరించారు. పశువైద్య శాఖ వైద్యులు జగన్నాథ రైతులకు పశు గ్రాసాల ప్రాముఖ్యత, ఉచిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమం గురించి వివరించారు. జిల్లా లోని అన్ని పశు వైద్య కేంద్రాల్లో ఉచితంగా కృత్రిమ గర్భధారణ చేస్తున్నారని చెప్పారు. బుధవారం నిర్వహించిన పశు వైద్య శిభిరం లో మండల పశు వైద్య అధికారి. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో 59 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స 67 పశువులకు సాధారణ చికిత్స 5 పశువులకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ చేశారు కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మహేందర్, సుశాంత్. పోషెట్టీ, మారుతి మరియు పాడి పశువుల పెంపకందారులు, పాడి పశువుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు..

అమరవీరుల పోరాట స్ఫూర్తి అలవరుచుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తి నేటి విద్యార్థులు అలవరుచుకోవాలని పిడిఎస్‌యూ నగర నాయకులు డోంగ్రి సాయి కిరణ్ అన్నారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభను బుధవారం నగరంలో అనందనిలయంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం 50 ఏండ్ల కాలంలో శాస్త్రీయ విద్యావిధానం, అసమానతలు లేని సమాజం కోసం విద్యారంగ సమస్యలపై పోరాడుతూ అనేకమంది విద్యార్థి రత్నాలు అమరవీరులయ్యారని తెలిపారు. విద్యార్థినిలు ప్రతి చోటా ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని , స్కాలర్షిప్ ల కోసం ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా, అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, రఘు, రాకేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి

బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఇవ్వాలని బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్‌పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ బుధవారం తెలిపారు. గత నెల 7న సమాచార హక్కు చట్టం 2005-06 సెక్షన్‌ను అనుసరించి సెక్షన్ 4 ప్రకారం కొంత మంది మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను, కొంత మంది అధికారులను మేనేజ్ చేస్తూ ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నట్టు తమ పార్టీ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆ విషయాన్ని నివృత్తి చేసుకోవడానికి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దరఖాస్తు చేసుకోని 40 రోజులు అవుతుందన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం 30 రోజుల్లో దరఖాస్తు చేసుకున్న వారికి అడిగిన సమాచారం ఇవ్వాలని చట్టం చెప్తుందని తెలిపారు. కానీ సమాచారం ఇవ్వని సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ విషయంపై మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్
మండలంలోని కొడిచర్ల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, బుధవా రం పట్టుకు న్నట్టు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం వాహనాన్ని కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించి నట్లు పేర్కొన్నారు.



ఆక్రమణలు తొలగించాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నగరంలోని 57వ డివిజన్ పరిధిలో ఉన్న ఏక్ మినార్ (డి-54కెనాల ఎదురుగా) వద్ద ఓ వ్యక్తిని రోడ్డును ఆక్రమించి కోకా ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డుపై కోకా ఏర్పాటు చేయడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని, స్కూల్ పిల్లలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే స్పందించి ఆక్రమణను తొలగించి స్థానికుల సమస్యను పరిష్కరించా లని అన్జద్ ఖాన్, అమేర్ ఖాన్, అమర్ బిన్ అహ్మద్, సయ్యద్ వాసి, జావెద్ బిన్ సల్మాన్, సయ్యద్ సమీ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద చల్లడం సరికాదు

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి
- తమ ప్రభుత్వాలు హామీలు ఎంతవరకు నెరవేర్చాయో చూసుకోవాలని హితవు

నవతెలంగాణ-కంఠేశ్వర్
ప్రతిపక్షాలుగా ప్రభుత్వంపై బురద చల్లడం, పసలేని ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించుకోగానే ఏం చేయాలో అర్థం కాని బిజెపి, బీఆర్ఎస్ నాయకులు తోక కాలిన కోతుల్లాగా మాట్లాడుతున్నారనిని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం గాని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , ఆరోగ్యశ్రీని 10 లక్షల వరకు పెంచడం, రైతు రుణమాఫీ చేయడం, ఉచితంగా సిలిండర్ అందించడం లాంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు. మిగిలిన వాటిని కూడా తొందరలో నెరవేరుస్తుందని ఆయన అన్నారు. రెండు లక్షల పైన ఉన్న వారికి పైన మిగిలిన డబ్బులు చెల్లిస్తే రుణమాఫీ అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు పేరుతో అనర్హులైన వారికి రైతుబంధువేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారికి రైతుబంధు ఇచ్చే విధంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నందున రైతుబంధు ఆలస్యం అవుతుందని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతి పేదవారి అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పి ఇప్పటివరకు వేయలేదని, ఇటీవల తెలంగాణలో వరదలు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం 100 కోట్ల వరకు నష్టపరిహారం తేని బిజెపి ఎంపీ అరవింద్ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. గతంలో ఆర్అండ్‌బి మంత్రిగా తన నియోజకవర్గంలో పేద వాళ్ళందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేని ప్రశాంత్‌రెడ్డి హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉందని అన్నారు. ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని, పేదవాళ్లకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన ప్రశాంత్ రెడ్డి ఈరోజు ఏ ముఖం పెట్టి మాట్లాడుతున్నాడో చెప్పాలని ఆయన అన్నారు. దాదాపు రెండు సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, కళ్యాణ లక్ష్మి , సర్పంచులకు చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కాంట్రాక్టుల బిల్లులు దాదాపు 70 లక్షల కోట్లు పెండింగ్లో పెట్టిందని తెలిపారు. హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విజయోత్సవాలు చేసుకోకూడదో చెప్పాలని అరవిందును, ప్రశాంత్ రెడ్డిని మానాల మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేశాయో ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చాయో చూసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజిరెడ్డి, సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మానాలమోహన్‌రెడ్డి